

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (2025 విద్యా సంవత్సరానికి)లకు ప్రతిపాదనలు కోరుతున్నట్లు డీఈవో మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రభుత్వ, డైట్, ఇతర మేనేజ్‌మెంట్(ప్రైవేటు మినహా)పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు తెలిపారు. కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. ఈ నెల 28లోగా ప్రతిపాదనలు అందజేయాలని పేర్కొన్నారు.

అయ్యకోనేరుకు సైబీరియా పక్షులు






నగరంలోని అయ్యకోనేరుకు అతిథులు వచ్చాయి. సైబీరియా దేశ పక్షులు ఒక్కసారిగా దర్శనమిచ్చాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అయ్యకోనేరు జలకళ సంతరించుకుంది. అయితే ఐదేళ్ల నుంచి పక్షులు అతి తక్కువ సంఖ్యలో వచ్చేవి. మంగళవారం సాయంత్రం ఓ పక్షుల గుంపు వచ్చి చెరువులో విహరించింది. అవి చేపలను వేటాడి తింటుండడం చూసిన వారంతా ఫొటోలతో క్లిక్‌మనిపించారు.

- విజయనగరం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి)



అయ్యకోనేరులో విహరిస్తూ..



ఇదేనా.. మీ పరిశీలన?

- 56 శాతం దివ్యాంగునికి ఇప్పుడు 5శాతమేనంట
- అర్హుల పింఛన్లు తొలగించిన అధికారులు
- దశాబ్దం నుంచి పొందుతున్న వారికీ అన్యాయం
- అప్పీల్ కోసం కార్యాలయాలకు బాధితుల పరుగు





● ఇతని పేరు మంత ఎర్నియుడు. శృంగవరపుకోట మండలం తలారి గ్రామ శివారు ఉసరి. రెండు కాళ్లలో ఒక కాలు చిన్నగా ఉంటుంది. 2008లో ప్రభుత్వ వైద్యుల బృందం 40శాతం దివ్యాంగత్వం ఉన్నట్లు ధ్రువపత్రం అందించింది. అప్పటికి ఇతని వయసు నాలుగేళ్లు. దాదాపు 15 సంవత్సరాల నుంచి పొందుతున్న దివ్యాంగ పింఛన్‌ను ఇటీవల పునఃపరిశీలనలో ప్రభుత్వం తొలగించింది.

● ఇతని పేరు పిల్లా స్వామినాయుడు. శృంగవరపుకోట మండలం తిమిడి గ్రామం. రెండు కాళ్ల వంకరపోయాయి. నడిచేందుకు నానా అవస్థలు పడుతున్నాడు. 2011లో ముగ్గురు వైద్యులతో కూడిన బృందం ఈయనలో 56శాతం దివ్యాంగ లోపం వున్నట్లు ధ్రువపత్రం అందించింది. అప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడు. ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగ ధ్రువపత్రాల పునఃపరిశీలనకు నియమించిన వైద్యులు ఐదు శాతం మాత్రమే లోపం ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం 40శాతం దివ్యాంగత్వం లేకపోవడంతో పింఛన్ తొలగించారు.

శృంగవరపుకోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)

పింఛన్ పునః పరిశీలన ప్రక్రియపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. పింఛన్‌కు అన్ని అర్హతలూ ఉన్న వారిని కూడా అనర్హులుగా తేల్చడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. గతంలో 90,87,7960 దివ్యాంగ శాతంతో సామాజిక పింఛన్‌లను అందుకుంటున్న వారిని అనర్హులుగా గుర్తించారు. శృంగవరపుకోట (మిగతా 8వ పేజీలో..)



ఎస్.కోట మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి అప్పీల్ కోసం వచ్చిన దివ్యాంగ పింఛన్‌దారులు



డోలీలో 8 కిలోమీటర్లు 6

- గర్భిణీని తరలించిన గిరిజనులు

నాగావళి తీరంలో భద్రం

- పరిస్థితులపై ఆరా తీసిన కలెక్టర్ అంబేడ్కర్
- మూడు మండలాల్లో పర్యటన


రేగిడి/సంతకవిటి/వంగర, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నాగావళి నది చెంత ఉన్న గ్రామాల్లో పరిస్థితులు, నది గట్టు పటిష్టతపై కలెక్టర్ అంబేడ్కర్ ఆరా తీశారు. వర్షాలకు నదిలో వరద ప్రవాహం పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచించారు. నాగావళి నది లోతట్టు గ్రామం బొడ్డవలసను మంగళవారం ఆయన సందర్శించారు. నది ప్రవాహాన్ని పరిశీలించాక ఇరిగేషన్ డీఈఈ గన్నిరాజు, ఆర్డీవో ఆశయ్య, తహసీల్దార్ కృష్ణలతతో చర్చించారు. రేగిడి, సంతకవిటి మండలాల్లో దాదాపు 22 వరదముంపు గ్రామాలున్నాయని వారు వివరించారు. లోతట్టు గ్రామాల్లో నదిలోకి ఎవరినీ దిగనివ్వకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. అక్కడే ఉన్న కొందరు రైతులు సంకిలి శివాలయం పైభాగంలో బ్రిటీష్‌కాలంలో నిర్మించిన కరకట్ట పాడైందని, ఇక్కడ గండికొడితే రెండు మండలాల్లో 12వేల ఎకరాల ఆయకట్టుతో పాటు కొన్నిగ్రామాలకు వరద ముంచుకొస్తుందని విన్నవించారు. కొత్త కరకట్ట నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న ఇరిగేషన్, రెవెన్యూ అధికార్లకు దీనిపై వివరణ అడిగారు. ప్రతిపాదనలు ఏదశలో ఉన్నాయో పరిశీలించి తగిన (మిగతా 8వ పేజీలో..)



నాగావళి తీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

బిక్కు బిక్కుమంటూ విధులు

- శిథిల భవనాల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది
- స్థలం ఉన్నా శాశ్వత భవనం లేదు
- ప్రతిపాదనల్లోనే పక్కా భవనం
- ఎక్సైజ్ జిల్లా కార్యాలయం పరిస్థితిదీ





శిథిలావస్థకు చేరిన ఎక్సైజ్ శాఖ కార్యాలయ భవనాలు

విజయనగరం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేరుకు జిల్లా కార్యాలయం.. అందులోనూ ఆదాయం తెచ్చే శాఖ. అయినా దశబ్దాలుగా శిథిల భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ జిల్లా కార్యాలయం పరిస్థితిదీ. పాలకులు మారుతున్నారు కాని ఈ కార్యాలయానికి నూతన భవనం మంజూరు కావడం లేదు. స్థల సమస్య ఉందా అంటే అదీ లేదు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఎకరా 62 సెంట్ల భూమి ఉంది. అది వృథాగా పడి ఉంది. శిథిలావస్థకు చేరిన భవనాల్లో విధులు నిర్వహించలేని దుస్థితిలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాల సిబ్బంది మాత్రం శిథిలావస్థకు చేరిన భవనాల నుంచే విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 30 మంది విధుల్లో ఉంటున్నారు. వర్షం పడితే ఆ భవనాల్లో నరకయాతనే. ఫైళ్లు తడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు.

● ఎక్సైజ్ శాఖ అంటే ప్రభుత్వానికి గణనీయంగా ఆదాయం తెచ్చే శాఖల్లో ముఖ్యమైనది. అటువంటి శాఖకు పక్కా భవనం (మిగతా 8వ పేజీలో..)

వాహనాల అతివేగంపై దృష్టి పెట్టాం

- ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్
- ఎస్పీ వకుల్‌జిందాల్



విజనగరం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నియంత్రణకు వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, తద్వారా వాహనాల అతివేగాన్ని కట్టడి చేస్తున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అతివేగంగా వాహనాలను నడిపిన వారిపై తాజాగా 23 కేసులు నమోదు చేసి అపరాధ రుసుం కింద రూ.25,665 వసూలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో బ్లాక్‌స్పాట్స్, హైవేలపై ముఖ్య కూడళ్ల వద్ద తనిఖీలు చేపట్టి అతివేగంతో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వేగంతో నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి వాహనదారుడు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

వారు సాధించారు

- కొండధారకు పైపు అమర్చి నీరు ఒడిసిపట్టిన వైనం
- సమస్యను స్వయంగా పరిష్కరించుకున్న చినచీపురువలస గిరిజనులు



కొండ దిగువన తాగునీరు పడుతున్న గిరిజన మహిళ



పైనుంచి అమర్చిన పైపు

మెంటాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామ గిరిజనులు తాగునీటి సమస్యను తామే పరిష్కరించుకున్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడకుండా భిన్నంగా ఆలోచించారు. కొండ రాళ్ల మధ్య నుంచి వస్తున్న జలధారను ఒడిసిపట్టుకునేందుకు ఓ పైపును అమర్చి అందులో నుంచి వచ్చే నీటిని తాగడానికి పట్టుకుంటున్నారు.

మెంటాడ మండలం పిట్టాడ పంచాయతీ చిన చీపురువలసలో పది కుటుంబాల వరకూ నివాసముంటున్నాయి. ఇదేదో కొండ శిఖరగ్రామం కాదు. మైదానప్రాంతంగా ఉన్న వాణిజ గ్రామానికి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉంది. ఊరు జనాభా 40కి మించదు. అంత తక్కువ జనాభాకు ఎవరూ తాగునీటి సౌకర్యం కల్పించలేకపోయారు. వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో స్వయంకృషితో (మిగతా 8వ పేజీలో..)

ఆంధ్ర భూముల ఆక్రమణపై అలసత్వం ఎందుకో?



అంధ్ర రిజర్వాయర్ ఆక్రమిత భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్న దృశ్యం

- తహసీల్దార్ లేఖపై ఇరిగేషన్‌శాఖ తాత్సారం
- రెండువారాలు దాటినా కదలిక లేని వైనం
- చెలరేగిపోతున్న కబ్జారాయుళ్లు
- ముంపు భయంతో వణుకుతున్న దిగువ గ్రామాలు
- సాగునీటిపై నిరాశలో రైతులు

ఆక్రమణకు గురైన ఆంధ్ర రిజర్వాయర్ భూముల లెక్క తేల్చాలని ఇరిగేషన్ అధికారులకు స్వయంగా తహసీల్దార్ లేఖ రాసి రెండువారాలు దాటినా అట్నుంచి కనీస స్పందన లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. తమ పరిధిలోని భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన అధికారుల్లో తహసీల్దార్ లేఖ రాసాకైనా కదలిక రాకపోవడం విమర్శలకు ఆస్కారమిస్తోంది. భూముల కబ్జా నిగ్గుతేల్చని పక్షంలో మరిన్ని భూములను చెరబట్టే ప్రమాదం ఉందని రిజర్వాయర్ దిగువ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెంటాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మెంటాడ, గజపతినగరం, బొండపల్లి మండలాలకు చెందిన సుమారు తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లక్ష్యంగా ఆంధ్ర రిజర్వాయర్ నిర్మాణం పురుడుపోసుకున్నప్పుడు భవిష్యత్తు అవసరాలను సైతం దృష్టిలో ఉంచుకుని మొత్తం 1050 ఎకరాలను సేకరించారు. అందులో ఎగువ ప్రాంతానికి చెందిన సుమారు రూ.20 కోట్ల విలువ చేసే దాదాపు 100 ఎకరాల భూమిని కొందరు దశలవారీగా ఆక్రమించారు. రిజర్వాయర్ గర్భం కన్నా ఎత్తుచేసుకొని దీర్ఘకాల వాణిజ్య పంటలు వేశారు. ఇదే విషయాన్ని పేర్కొంటూ ఈ నెల 2న ఆంధ్రజ్యోతిలో 'ఆంధ్ర భూములు హాంఫట్' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. కథనంపై స్పందించిన తహసీల్దార్ అరుణకుమారి ఆంధ్ర భూముల్లో ఆక్రమణల లెక్క తేల్చాలని (మిగతా 8వ పేజీలో..)



అలనాటి భవనం... ఆధునిక రూపం

● మోతీమహల్‌కు కొత్త హంగులు

విజయనగరం కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర గల విజయనగరం కోటలోని పురాతన భవనాలు ఆధునిక హంగులు అద్దుకుంటున్నాయి. వీటిలో మోతీమహల్‌కు ఓ ప్రత్యేకత ఉంది. విజయనగరం సంస్థానాధీశుల పురాతన కట్టడాల్లో ఇదొకటి. ఈ భవనంలో ఒకప్పుడు మహిళా కళాశాలను నిర్వహించారు. రాను, రాను భవనం శిథిలావస్థకు చేరుతుండడంతో కొత్త హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది మళ్లీ విద్యాలయాలను కొనసాగించడానికి మాన్సాస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పీవీజీ రాజు తన తండ్రి అలక్‌నారాయణ గజపతిరాజు పేరిట మాన్సాస్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు పేరుతో ఉన్న అనేక భవనాలను విద్యాలయాలకు ఉపయోగించేవారు. కోటలో ఉన్న మోతీమహల్ భవనంలో పాఠశాల, కళాశాల ఉండేవి. దీనిని మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు.. మోతీమహల్ రూపురేఖలు చెదిరిపోకుండా ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఈ భవనం ముందుభాగంలో విశాలమైన ప్రాంగణంలో పీవీజీ రాజు విగ్రహ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ భవనం ఆధునిక హంగుల ప నులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెలఖరులోగా ఈ భవనాన్ని మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



పీవీజీ విగ్రహం ఏర్పాటుకు ఇలా..



కొత్త రూపు సంతరించుకుంటున్న మోతీమహల్





పసుపుతో ముత్యాలమ్మ.. గాజులతో తోగాలమ్మ

భోగాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుడివాడ పంచాయతీలో గల ముత్యాలమ్మ, తోగాలమ్మ అమ్మవార్లను మంగళవారం భక్తులు వినూత్నంగా అలంకరించారు. ముత్యాలమ్మ అమ్మవారిని పసుపు కొమ్ములతోను... తోగాలమ్మ అమ్మవారిని గాజులతోను అలంకరించారు. గుడివాడ పంచాయతీతో పాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవార్లను దర్శించుకొని... ప్రత్యేక పూజలు చేశారు.

డోలీలో 8 కిలోమీటర్లు

● గర్భిణిని తరలించిన గిరిజనులు

● సరైన రహదారి లేక అవస్థలు

అది అత్యంత క్లిష్టమైన సమయం. కానీ వాహనం ఊరులోకి రాలేని దైన్యం. ఆలస్యమైతే రెండు ప్రాణాలకు ప్రమాదం. ఇక చేసేదిలేక ఆ ఊరి జనం డోలీని పట్టుకున్నారు. నిండు గర్భిణిని 8 కిలోమీటర్ల దూరం మోసుకెళ్లి... 108 వాహనంలోకి ఎక్కించి.. ప్రసవం కోసం ఆస్పత్రికి తరలించారు. కొత్తబట్టివలసలో చోటుచేసుకున్న ఈ సంఘటన గిరిజనుల కష్టాలకు అద్దం పడుతోంది.



గర్భిణిని డోలీపై ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోగల కొత్తబట్టివలస గిరిజన గ్రామానికి చెందిన సిదరపు గౌరమ్మకు మంగళవారం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో డోలీలో తరలించాల్సి వచ్చింది. ఆ గ్రామానికి పక్కా రహదారి లేకపోవడం... ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉన్న రోడ్డు బురదమయం కావడంతో కొత్తబట్టివలస నుంచి గోపాలరాయుడుపేట వరకూ ఎనిమిది కిలోమీటర్లు డోలీలోనే గ్రామస్థులు మోసుకొని వెళ్లారు. అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలో గల పిరిడి పీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించారు. అనంతరం వైద్యాధికారి రఘువంశీ పరీక్షించి ప్రసవానికి ఏర్పాట్లు చేయించారు. ఆమెకు మగబిడ్డ జన్మించాడని.. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని రఘువంశీ తెలిపారు.

ఏటా వర్షాకాలంలో తప్పని అవస్థలు..

మండలంలోని కొత్త బట్టివలస, అక్కేనవలస, మోసూరువలస, సియోనువలస, కృపావలస తదితర గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలంలో అనారోగ్యంతో బాధ పడేవారిని, గర్భిణులను డోలీలో ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలు ప్రజలు రోడ్లు, ఇతర సదుపాయాల కోసం అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వీరి సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా... వందల కోట్లు రూపాయలు గిరిజనుల అభివృద్ధికి వెచ్చిస్తున్నామని పాలకులు పెద్ద ప్రచారం చేయడమే తప్ప నిజమైన అభివృద్ధి కానరావడం లేదని ప్రగతిశీల మహిళా సంఘ అధ్యక్షురాలు రమణి ఆరోపించారు.

ఉచిత ప్రయాణం.. మహిళల్లో ఆనందం

● 'స్త్రీ శక్తి'తో ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ



పాలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. ఐదు రకాలైన బస్సు సర్వీసుల్లో ప్రయాణం చేసే అవకాశం కల్పించింది. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పాలకొండ ఆర్టీసీ డిపో పరిధిలో స్త్రీ శక్తి పథకానికి ముందు రోజుకు సగటున 27 వేల మంది రాకపోకలు సాగించేవారు. ఇందులో 15 వేల మంది మహిళలు ఉండేవారు. స్త్రీశక్తి పథకం ప్రారంభమైన తర్వాత ఈ సంఖ్య రెట్టింపైనట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇంతకుముందు పాలకొండ-శ్రీకాకుళం ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో రోజుకు సరాసరి రూ.14 వేల నుంచి రూ.16 వేల మధ్య టిక్కెట్ల రూపంలో నగదు వచ్చేది. ప్రస్తుతం స్త్రీ శక్తి పథకం ప్రారంభం తర్వాత అదే సర్వీసుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల విలువైన టిక్కెట్లు అవుతున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య ఏ మేరకు పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే జిల్లాలోని పాలకొండ, సాలూరు, పార్వతీపురం డిపోల నుంచి విశాఖపట్నానికి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నారు. ఇలా సుదూర ప్రాంతాలకు ఒకే బస్సులో ప్రయాణించే అవకాశం కలుగుతుండడంతో మహిళలు వాటిని ఆశ్రయిస్తున్నారు. ఆ మేరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు డిమాండ్ పెరిగింది.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణలీలలు నృత్య రూపకంలో ఇలా...

విజయనగరం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణజన్మాష్టమి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నగరంలోని గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం శ్రీకృష్ణునికి నృత్య నీరాజనం నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కొత్తపేటలోని కోదండ రామాలయంలో జన్మాష్టమి వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, బొబ్బిలి, ఎస్.కోట, గజపతినగరం, రాజాం తదితర ప్రాంతాల్లో ఈ నెల 24 వరకూ ఉత్సవాలు కొనసాగనున్నాయి.

పాలకొండ వాసికి యూఏఈ గోల్డెన్ వీసా

పాలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గెడ్డ కుమ్మరి వీధికి చెందిన లోచర్ల హరిబాబుకు యుఏఈ ప్రభుత్వం గోల్డెన్ వీసాను మంజూరు చేసింది. యూఏఈలోని నేషనల్ ఆయిల్ కంపెనీ శాస్త్రవేత్తల్లో ప్రత్యేక కేటగిరీ కింద అక్కడి ప్రభుత్వం హరిబాబుకు ఈ అవకాశం కల్పించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, క్రీడాకారులు, సినీ నటులు, మిగిలిన సెలబ్రిటీలకు మాత్రమే గోల్డెన్ వీసా అందజేస్తుంటారు. అలాంటి గౌరవం ఈ ప్రాంతవాసికి రావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పాలకొండలో ఉంటున్న హరిబాబు తండ్రి లోచర్ల సంజీవరావు, మామయ్య పైల తవిటినాయుడు, బావ శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.



హరిబాబు



భామిని: నులకజోడు వద్ద కోతకు గురైన రోడ్డు



సంతకవిటి: అక్కరాపల్లి సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు

నీట మునిగిన పొలాలు..

సంతకవిటి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మందరాడ, ముకుందపురం, అక్కరాపల్లి గ్రామాల్లో వరి పొలాలు నీటి మునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్

● కాజ్‌వేపై నీటి ప్రవాహం

మక్కువ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిరిపల్లి వద్ద గల కాజ్‌వేపై వరదనీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులోని గోముఖి రెగ్యులేటర్‌లో సామర్థ్యానికి మించి వరద నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం మధ్యాహ్నం గోముఖి రెగ్యులేటర్ నుంచి నదిలోకి నీటిని విడిచిపెట్టారు. దీంతో నదీ పరీవాహక ప్రాంతమైన కవిరిపల్లి వద్ద గల కాజ్‌వే పైనుంచి సుమారు 5 అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో మక్కువ, శంబర రోడ్డు మార్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కవిరిపల్లి కాజ్‌వే ముంపునకు గురికావడంతో ప్రజలు, వాహనదారులు మక్కువ మండల కేంద్రానికి చేరుకోవడానికి అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వెంగళరాయసాగర్ జలాశయం పూర్తిగా నిండటంతోనే మిగులు నీటిని నదిలోకి వదులుతున్నట్లు డీఈఈ డి.సురేష్ తెలిపారు.



కవిరిపల్లి వద్ద కాజ్‌వేపై నీటి ప్రవాహం

తగ్గిన వరద..

భోగాపురం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): గత 6 రోజులుగా కురిసిన వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు లోపల నుంచి వరదనీరు బయటకు ప్రవహిస్తూ చుట్టుపక్కల గ్రామాలను ముంచెత్తింది. ఎట్టకేలకు వాతావరణం మారడంతో మంగళవారం వరద నీటి ప్రవాహం తగ్గింది.



పాలకొండ: ఓని-స్కాట్‌దొరవలస రహదారి ఇలా..



కొమరాడ మండలం కర్లగండ వద్ద దోని పక్క నుంచి వెళ్తున్న ప్రజలు



భోగాపురం: ఎయిర్‌పోర్టు ప్రహరీ వద్ద తగ్గిన వరద నీరు

కొత్తగా 'పరీక్ష'

● జవాబు పత్రాల స్థానంలో బుక్‌లెట్లు


● పాఠశాల విద్యలో నూతన విధానం

● విద్యార్థుల ప్రగతి, సామర్థ్యం సులువుగా అంచనా

లక్కవరపుకోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ... విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రశ్న, సమాధాన పత్రాలకు స్వస్తి పలికి బుక్‌లెట్ విధానాన్ని తీసుకువచ్చింది. ప్రతి సబ్జెక్టుకూ స్టూడెంట్ అసెస్మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. 1 నుంచి 10వ తరగతి వరకు నూతన పరీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. పరీక్షలన్నీ సబ్జెక్టుల వారీగా బుక్‌లెట్ల లోనే విద్యార్థులు రాయాలి. గతంలో మాదిరిగా ప్రత్యేకంగా ప్రశ్నపత్రాలు ఉండవు. బుక్‌లెట్‌లో ప్రశ్నలు, జవాబులకు సరిపడా పేజీలు కేటాయించింది. సోషల్‌కి సంబంధించిన మ్యాపులు, గణితానికి సంబంధించిన గ్రాఫ్‌లు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు సంబంధించిన ఓఎంఆర్ షీటు అన్నీ అందులోనే ఉంటాయి. విద్యార్థుల అపార్ ఐడీ నెంబర్, పూర్తి వివరాలు, ప్రశ్నపత్రం కోడ్, పరీక్ష సమయం అందులో ఉంటాయి. ఎఫ్ఏలు నాలుగు, ఎస్ఏలు రెండు పరీక్షల తేదీలతో పాటు బుక్‌లెట్‌లో ఉంటాయి. ఈ బుక్‌లెట్ ఆధారంగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాన్ని ఉన్నతాధికారులు అంచనా వేస్తారు. దీనిని బట్టి విద్యార్థులకు ఏబీసీడీ కేటగిరిలుగా కేటాయిస్తారు.



అపార్ ఐడీతో కూడిన విద్యార్థి వివరాల నమోదు పత్రాలు



ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీటుతో కూడిన బుక్‌లెట్

గత ప్రభుత్వంలో..

గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. విద్యార్థులకు కనీసం ప్రశ్నపత్రాలు అందించలేని దుస్థితి నెలకొంది. ఉపాధ్యా యులు బోర్డులపై ప్రశ్నలు రాస్తే వాటిని విద్యార్థులు ఎక్కించుకొని పరీక్షలు రాసేవారు. కనీసం సుద్దముక్కకు కూడా డబ్బులు ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతోంది.

పని ఒత్తిడి లేకుండా..

నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్షా విధానాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తూనే.. పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రవేశపెట్టిన పరీక్షా విధానం బాగుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాన్ఫరెన్స్, యాప్‌లు వంటివి తగ్గిస్తే మంచి ఫలితాలు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

చెడు మార్గంలో వెళ్లొద్దు

గజపతినగరం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ నిర్మూలనపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సీహెచ్‌వో ఇమామ్ అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట, పట్రువాడ గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఎల్‌డబ్ల్యూఎస్ శ్రీదేవి, ఏఎన్ఎం బీనా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

గజపతినగరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, ఏ ఒక్క రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కెంగువ, ఎం.కొత్తవలస గ్రామాల్లో ఆయన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచామని చెప్పారు.

పగలూ ఆగని విద్యుత్ దీపాలు



పగటి పూట వెలుగుతున్న విద్యుత్ దీపం

భోగాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అమటాంరాయవలస పంచాయతీలోని వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి, పగటి పూట విద్యుత్ దీపాలు వెలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా నాగార్జున పుట్టినరోజు వేడుకలు

చీపురుపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కిమిడి మిత్ర మండలి సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. బీవీ గోవిందరాజులు, పనస రవి, ప్రసాద్, కానూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడండి

చీపురుపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో హేమసుందరరావు సూచించారు. కరకాం గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చెత్త సంపద కేంద్రం, వాటర్ ట్యాంకు, సచివాలయాలను సందర్శించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయంలో ఈ సేవలు, జీఎస్‌డబ్ల్యూఎస్ తదితర సర్వీసులు పరిశీలించారు. తాగునీటి పంపిణీ వ్యవస్థ పనితీరుపై ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మట్టి గణపతి శ్రేయస్కరం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించుకోవడం శ్రేయస్కరమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు నిమజ్జనం అనంతరం నీటిలో కరగకపోగా.. వాటి రసాయనాలు చెరువులో ఉండే జీవజాతిపై ప్రభావం చూపుతాయని చెప్పారు. అలాగే మండపాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. వినాయక చవితి పర్యావరణ హితంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

నిరాశ్రయులకు అన్న సమారాధన

దాసన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజని పుత్ర చిరంజీవి బ్లడ్‌డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి లాలిశెట్టి రవితేజ, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అధ్యక్షుడు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, అంజనీపుత్ర ఉపాధ్యక్షుడు లోపింటి కళ్యాణ్, మొయిద రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్టి సంబరం



ఉట్టి సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి దేవాలయంలోని వేణుగోపాలస్వామికి శ్రావణ బహుళాష్టమి సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం అయ్యవార్ల మేడ వద్ద ఘనంగా ఉట్టి సంబరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నరకం?

- చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై నిలుస్తున్న మురుగు
- కొరవడిన పారిశుధ్య నిర్వహణ
- పలుచోట్ల డ్రైనేజీ కాలువలు లేని వైనం
- ఇదీ రాజాం నగరంలోని దుస్థితి





సప్తగిరి కాలనీలో నిలిచిన మురుగు, మెయిన్‌రోడ్‌పై ఇలా..

రాజాం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు నరకం అనుభవిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా మెయిన్ రోడ్డు సహా చాలావీధుల్లో మురుగు నీటితో కూడిన వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. దీంతో నగరవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. మెంటిపేట ఎస్సీ కాలనీ, గొల్ల వీధి, చాకలి వీధి, రెల్లి వీధి తదితర స్లమ్ ఏరియాలలో పారిశుధ్య నిర్వహణ కొరవడింది. ఆయా వీధుల్లోకి అడుగు పెట్టేందుకు కూడా వీలుకాని పరిస్థితి. బాబానగర్‌లోని నాలుగు లైన్లు, ఈశ్వర నారాయణ కాలనీలోని ఐదు లైన్లలో నేటికీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతోంది. మల్లికార్జున కాలనీలోని ఆరులైన్లలో కూడా ఇదే పరిస్థితి. అంబేద్కర్ జంక్షన్ నుంచి శ్రీకాకుళం రోడ్‌లో కూడా డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో కిలోమీటర్ మేర మురుగునీరంతా రహదారిపైనే నిలిచిపోయే పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిసినా ఈ మార్గంలోని సప్తగిరి కాలనీ వాసుల వెతలు వర్ణనాతీతం. మురుగునీరంతా ఇళ్లల్లోకి చేరుతోంది. రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోతుండడంతో గృహస్థులు ఇళ్లల్లోకి కూడా వెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితి. పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచకపోవడంతో ఉన్న సిబ్బందికి నిర్వహణ తలకు మించిన భారంగా మారుతోంది. ఇదిలా ఉంటే పట్టణంలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల సంతతి పెరిగిపోయి ప్రజలు రోగాలబారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

ఎవరైనా అక్కడ నెమ్మదిగా వెళ్లాల్సిందే..



ఎంఆర్‌పేట వద్ద నెమ్మదిగా వెళ్తున్న కలెక్టర్ కారు

రేగిడి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పాలకొండ- విశాఖ మార్గంలోని రాజాం రూట్‌లో మజ్జిరామునిపేట వద్ద దాదాపు 200 మీటర్ల రోడ్డు పూర్తిగా పాడయ్యింది. ఇటీవల వర్షాలకు రహదారిలోని గుంతల్లో నీరుచేరి ప్రమాదకరంగా మారింది. ఈ రూట్లో వర్షం పడే సమయంలో ఎవరు ప్రయాణించాలన్నా హడలెత్తిపోతున్నారు. మంగళవారం రేగిడి మండలం పర్యటనకు వచ్చిన కలెక్టర్ అంబేడ్కర్‌కు ఇదే పరిస్థితి వచ్చింది. కలెక్టర్ కారుకు ఇక్కడకు వచ్చేసరికి బ్రేక్ పడింది. పక్క నుంచి నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

నెల్లిమర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాలకు, నగర పంచాయతీకి వినాయక చవితి ఉత్సవాలకు మైక్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. నెల్లిమర్ల పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే శబ్దాలు, డీజేలు మండపం వద్ద, ఊరేగింపులో నిషేధమన్నారు. అలాగే మందుగుండు సామగ్రి, అశ్లీల నృత్యాలు చేయరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్రమణలపై దృష్టి సారిస్తాం

కొత్తవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురవుతున్న గెడ్డలు, చెరువులపై దృష్టి పెడుతున్నామని కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఇటీవల రెండు రోజులు కురిసిన వర్షాలు కారణంగా గెడ్డలలో నుంచి వెళ్లాల్సిన నీరు రోడ్ల మీదకు వచ్చిందన్నారు. కొత్తవలసలో వీరసాగరం చెరువుకు సంబంధించిన కాలువలతో పాటు, కొత్తవలస డాబాలు గెడ్డలో ఆక్రమణలు ఉన్నాయని చెప్పారు. గెడ్డ ఆక్రమణ చేయడం వల్లే నీరు రోడ్డు మీదకు వచ్చిందన్నారు. కొత్తవలస పంచాయతీ పరిధిలో ఉన్న వీఆర్వోలందరూ ఆక్రమణలపై దృష్టి సారించి తనకు నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఆక్రమణదారులందరికీ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. ఎక్కడ ఆక్రమణలు చేస్తున్నారో ప్రజలు కూడా తమకు ఫిర్యాదులు చేయాలని కోరారు.

అక్రమ ఆశీలు వసూలుపై చర్యలు

పూసపాటిరేగ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగలో చేపల మార్కెట్, సిమెంట్ గొడౌన్‌లు.. తదితర వాణిజ్య కూడళ్ల వద్ద కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని, వీటికి పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదని స్థానిక సర్పంచ్ టొంపల సీతారాం స్పష్టంచేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ ఆశీలు వసూలుపై అందిన ఫిర్యాదు మేరకు పంచాయతీ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని మండల పంచాయతీ అధికారి దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

శృంగవరపుకోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. అంతకుముందు విశాఖ-అరకు రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రత్న, చరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- విశాఖ మేయర్‌కు ఎమ్మెల్యే లలితకుమారి వినతి



విశాఖ మేయర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట/ లక్కవరపుకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలో కొన్ని గ్రామాలు విశాఖ జిల్లాతో ముడిపడి ఉండడంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతున్నాయని అందుకు తమకు సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు.. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీలా శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొత్తవలస-దేవరాపల్లి రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని కోరారు. బానాది-బల్లంకి మార్గంలో శ్లాబ్ పనులకు, కృష్ణాపురం చుట్టుపక్కల గ్రామాల రోడ్లకు సుమారు రూ.2.50 కోట్లు కేటాయించాలని కోరారు. అలాగే రైవాడ నీటి పథకం చుట్టు ఉన్న గ్రామాల రోడ్ల అభివృద్ధికి సహకరించాలని అడిషనల్ డైరెక్టరేట్ కమిషనర్ వర్మకు అంచనా విలువలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కేటీపీ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, కొట్యాడ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పార్కులో నిలిచిన అభివృద్ధి పనులు



ప్రహరీ నిర్మాణంలో నాణ్యత లేదంటూ ఆరోపిస్తున్న పార్కు కమిటీ ప్రతినిధులు

విజయనగరం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ రీజయన్ మెట్రోపాలిటిన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) విడుదల చేసిన నిధులతో గాంధీ పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. గాంధీ పార్కు ప్రహరీ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. 30 ఏళ్ల కిందట కట్టిన ప్రహరీ ఒక వైపు పడిపోతుంటే, అదే గోడపై తిరిగి నిర్మాణం చేపట్టడంతో పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఈ పనులను మంగళవారం అడ్డుకున్నారు. అదే విధంగా పార్కులో వివిధ మొక్కలు పెంపకానికి, ఇతర అవసరాలకు గాను కొత్త బోరు వేయాల్సి ఉంది. అలా కాకుండా పాత బోరునే మరమ్మతులు చేసి వినియోగించడాన్ని పార్కు అభివృద్ధి కమిటీ వ్యతిరేకిస్తున్నది. ఇదే విషయాన్ని ఈనెల 16న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. పార్కు ప్రహరీ పటిష్టంగా నిర్మించాలని, కొత్త బోరును వేయాలని పార్కు కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చి.. ట్రాఫిక్ నియంత్రించి



గుంతలు కప్పుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

విజయనగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుంచి జిల్లా కేంద్రంలో కురిసిన వర్షాల కు రోడ్లు ఛిద్రమయ్యాయి. అనేక చోట్ల గుంతలమయంగా మారాయి. గూడ్స్‌షెడ్స్ వద్దగల డీఎస్పీ కార్యా లయానికి వెళ్లే మార్గంలో భారీగా గుంతలు పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడ్డారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ గుంతల వల్లే ట్రాఫిక్ అంతరాయమని గమనించారు. వెంటనే జోరువర్షాన్ని సైతం లెక్క చేయకుండా.. దగ్గరలో ఉన్న మట్టిరాళ్లను తీసుకొచ్చి రోడ్డుపైన ఉన్న గుంతలను పూడ్చారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తానే స్వయం వర్షంలో గుంతల పూడ్చి ట్రాఫిక్ ఇబ్బందుల కు చెక్‌పెట్టిన కానిస్టేబులను వాహనదారులు అభినందించారు.

ఫొటో జర్నలిజంతో సామాజిక మార్పు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలనిక్కు

విజయనగరం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫొటో జర్నలిజంతో సామాజిక మార్పు కలుగుతుందని కెనడాలో థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బాల నిక్కు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగం, సోషల్ విభాగం ఆధ్వర్యంలో ఫొటో జర్నలిజం ఫర్ రెసిలియంట్ కమ్యూనిటీస్ అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఫొటో జర్నలిజం సామాజిక మార్పు, చైతన్యం కల్పన, కమ్యూనిటీ రెసిలియెన్స్ బలోపేతంలో పోషించే కీలకపత్రను వివరించారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్‌మిశ్రా, స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ ఎం.శరత్‌చంద్రబాబు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ దీపక్‌మోహనరావు షిండే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

రాజాం రూరల్: రాజాంలో ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి రూ.13వేలు అందజేశారు. ఫొటోగ్రఫీ యూనియన్ రాష్ట్ర నాయకుడు సుంకరపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు



గరికపాడు సమీపంలో కుంగిన కల్వర్టు

సంతకవిటి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని రాజాం-సంతకవిటి ప్రధాన రహదారిలో గరికపాడు గ్రామం వద్ద ఉన్న కల్వర్టు కుంగిపోయి, పెద్ద గుంత ఏర్పడింది. దీంతో గ్రామస్థులు ఆ గుంత వద్ద కర్రపాతి ఎర్రటి చీరను చుట్టారు. అధికారులు స్పందించి ఈ కల్వర్టును బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మా భూములు ఇవ్వండి

- జిందాల్ నిర్వాసితుల నిరసన



ర్యాలీ చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిందాల్‌కు గ్రామ సభల ద్వారా కేటాయించిన భూములు కాకుండా వేరే భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఇది తగదని జిందాల్ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బొడ్డవర గ్రామంలో మంగళవారం వారు నిరసన చేపట్టారు. తమ భూములు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాడైన కల్వర్టులను పట్టించుకోరా?

- రసాభాసగా గంట్యాడ సర్వసభ్య సమావేశం



సమావేశంలో ప్రశ్నిస్తున్న సభ్యులు

గంట్యాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సరసాభాసగా సాగింది. ఆర్అండ్‌బీ జేఈ సమావేశానికి హాజరు కాకపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో చాలా కల్వర్టులు పూర్తి దెబ్బతిన్నాయని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు గత 14 నెలలు నుంచి విడుదల కాకపోవడంపై పలువురు ప్రశ్నించారు. అలాగే దివ్యాంగుల పింఛన్ల నిలిపివేతపై ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ నోటీసులు అందుకున్న పింఛనదారులు అపీల్ చేసుకుంటే తమ లాగిన్ నుంచి డీఆర్‌డీఏ పీడీ లాగిన్‌కు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, గజపతినగరం మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాలరాజు, జడ్పీటీసీ సభ్యులు వర్రి నర్సింహమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ర్యాలీలో అపశ్రుతి

- కుప్పకూలిన జిల్లా యువకుడు.. చికిత్స పొందుతూ మృతి



సాయికిరణ్ (ఫైల్)

సంతకవిటి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ ఎంపికల్లో భాగంగా కాకినాడలో నిర్వహించిన ర్యాలీలో అపశ్రుతి చోటు చేసుకుంది. విజయనగరం జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన గండ్రేటి సాయికిరణ్(19) కాకినాడలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ర్యాలీలో పాల్గొన్నాడు. మంగళవారం రన్నింగ్ చేస్తుండగా మైదానంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే కాకినాడలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4గంటలకు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ తల్లిదండ్రులతో పాటుగా చెల్లి శ్రీలేఖ కన్నీరు మున్నీరవుతున్నారు.

గడ్డి కోతకు వెళ్లి.. విగత జీవిగా మారి



జగన్నాథం (ఫైల్)

భామిని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన గిరిజనుడు పత్తిక జగన్నాథం(44) మంగళవారం గడ్డికోతకు వెళ్లి విగత జీవిగా మారాడు. బత్తిలి పోలీసుల కథనం మేరకు.. జగన్నాథం పొలం బట్టి వద్దకు మంగళవారం గడ్డికోతకు వెళ్లాడు. కొంతసేపటి తర్వాత స్థానికులు జగన్నాథం మృతదేహాన్ని బట్టి వద్ద గుర్తించారు. అనంతరం సమాచారం తెలు సుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నీటిలో మునిగి గాని, ఏ విష పురుగు కాటువేసి చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు జగన్నాథం భార్య వనజాక్షి నుంచి స్టేట్‌మెంట్ తీసుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి శవ పంచనామాకు తరలించారు. కాగా జగన్నాథం కుటుంబ సభ్యులకు సంబంధించి మంగళవారం రాత్రి నూతన గృహప్రవేశం నిర్వహించనున్నారు. ఇంతలో జగన్నాథం మృతిచెందడంతో బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- పలువురికి గాయాలు



బస్సు ముందు భాగం నుజ్జయిన దృశ్యం

పూసపాటిరేగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేరాపురం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్ లారీని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జయ్యింది. బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని సుందరపేట సీహెచ్‌సీకి తరలించి, చికిత్స చేశారు. అదపాక బంగారమ్మ అనే ప్రయాణికురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

బొబ్బిలి రూరల్ , ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారసింహునిపేట సమీపంలోని మంగళవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మక్కువ నుంచి మర్రాపు జానకిరాము అనే వ్యక్తి బైకుపై సీహెచ్ బొడ్డవలస వస్తున్నాడు. అదే సమయంలో బొబ్బిలి నుంచి మక్కువ వైపు కొల్లి పోలీసు, కొల్లి శివ బైకుపై వస్తున్నారు. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆటోపై బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

గజపతినగరం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మరుపల్లి గ్రామానికి చెందిన పారాది మోహన్‌మురళీకృష్ణ గంజాయి అమ్మకాలు చేపడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేసి, పట్టుకున్నామని సీఐ రమణ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. మరుపల్లి గ్రామానికి చెందిన పారాది మోహన్‌మురళీకృష్ణ అదే గ్రామానికి చెందిన పల్లి నవీన్‌తో కలిసి ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి విజయనగరం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు అధిక ధరకు అమ్ముతున్నట్టు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు నిఘా పెట్టామని తెలిపారు. ఈక్రమంలో సోమవారం మరుపల్లి గ్రామంలో రైస్ మిల్లు వద్ద ఉన్న మోహన్‌మురళీకృష్ణను పట్టుకుని, 1.30 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు. మరో నిందితుడు పల్లి నవీన్ పరారీ కావడంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం

కొమరాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుమడ గ్రామ పరిసర ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు నుంచి 20 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వీరిద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి, కేసు నమోదు చేశారు.

దెప్పూరులో అధికారుల విచారణ

ఎస్.కోట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా జిందాల్ యాజమాన్యం తమ భూములను, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకుందని, తమ ఊరును తమకు తెలియకుండా మాయం చేసిందని కొద్ది రోజుల కిందట కిల్తంపాలెం పంచాయతీ దెప్పూరు గిరిజనులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వేయర్ రామ, ఆర్ఐ మనోజ్ తదితరులు గ్రామానికి వెళ్లారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న గిరిజనులు మాట్లాడుతూ తమ తాతతండ్రుల కాలం నుంచి ఇక్కడే బతుకుతున్నామని కొద్ది రోజుల కిందట కొంతమంది వచ్చి ఈ భూమి జిందాల్‌కు ఇచ్చేశారని చెప్పడంతో ఆశ్చర్యపోయామన్నారు. ఈ భూమి జిందాల్‌కు ఇస్తే ఇక్కడ కట్టుకున్న తమ ఇళ్లకు పట్టాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇతర పథకాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తమను ఇక్కడ నుంచి ఖాళీ చేయించొద్దని వేడుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మట్లాడుతూ సర్వే నెంబర్ 146/4లో నివేదిక ఇవ్వాలని వచ్చిన ఆదేశాల మేరకు పరిశీలన చేశామని, నివేదిక కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

నూతన బార్ విధానంతో నష్టం

విజయనగరం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీతో నష్టపోతామని వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సీతారామయ్య, పాకలపాటి సన్యాసిరాజు తెలిపారు. మంగళవారం విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దరఖాస్తు చేయాలంటే రూ.5లక్షలు నాన్ రిఫండబుల్ చెల్లించాల్సి ఉందని, మరో వైపు బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ విధానం చేస్తామని షరతు విధించిందన్నారు. అలాగే వైన్ షాపుల వద్ద పర్మిట్ రూంలను అనుమతులు ఇవ్వనున్నట్టు ప్రకటించడంతో తమలో ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు. గత ఏడాది పాలసీతోనే సుమారు రూ.30లక్షలు నష్టపోయామని.. ఈ విధానంతో మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తాము దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రాలేమన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీ దృష్టికి వయోశ్రేష్టుల సమస్యలు



ఎస్పీ వకుల్ జిందాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వయోశ్రేష్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హామీ ఇచ్చారని ఆ సంఘం జిల్లా శాఖ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.జగన్నాథరావు తెలిపారు. మంగళవారం ఎస్పీని కలిసి వయోశ్రేష్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశామని ఆయన చెప్పారు. సీనియర్ సిటిజెన్స్ ప్రాణ, ఆస్తి సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని, తల్లిదండ్రులు వృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళిని సరిగా అమలు జరిగేలా చూడాలని కోరామన్నారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో సీనియర్ సిటిజన్స్ సంఘ ప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, వారి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. తమకు తగిన భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు చేపడతామని ఎస్పీ హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి టి.సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు లేక.. సాగుకు ఆసక్తి చూపక

- విత్తనాల కోసం అగచాట్లు
- ఇదీ విత్తనోత్పత్తి రైతుల పరిస్థితి

బొబ్బిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విత్తనపంట సాగు చేసేందు కు అదనంగా ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతులకు ఆసక్తి చూపడంలేదు. గతంలో రైతులే సొంతంగా విత్తనాలు తయారుచేసుకునే వారు. దీంతో డీలర్లపై ఆధారపడేవారు కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఆశించిన విధంగా సహకరించకపోవడంతో విత్తనాలకు ఏటా ఖరీఫ్‌లో వెంపర్లాట తప్పడం లేదు. ఈ నేపథ్యంలో విత్తనోత్పత్తికి రైతులు ముందుకు రావడంలేదు.

జిల్లాలో ప్రతి ఏటా రైతులు వరివిత్తనాల కోసం వెంపర్లాడడం తప్పడంలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులే స్వయంగా తమ పంటపొలాల్లో విత్తనపంటను సాగు చేసుకోవాల్సిఉంది. జూన్, జూలైల్లో విత్తనాలకోసం ప్రభుత్వ, ప్రైవేట్ డిపోల ఎదుట బారులు తీరడం, కోరుకున్న విత్తన రకం అందుబాటులో లేక నిరాశకు రైతులు గురవుతున్న విషయం విదితమే. విత్తనోత్పత్తిని రైతులే తమ పంట పొలాల్లో సాగు చేసుకుంటే ఈ దుస్థితి నుంచి గట్టెక్కవచ్చని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. కేళీ లేని వరిపంట నుంచి విత్తనాలను సేకరించి, వాటిని శుద్ధిచేసి, ఏడాది పొడవునా గాదెల్లో భద్రపరుచుకోవడం సంప్రదాయంగా వస్తున్న పద్ధతులను రైతులు పూర్తిగా విడిచిపెట్టేశారు. విత్తనాలను రైతులే తయారు చేసుకుంటే పెట్టుబడులు కూడా తగ్గుతాయి. మార్కెట్‌లో కిలో విత్తనాలను 23 నుంచి 40 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. రైతులు స్వయంగా పండించుకుంటే కిలో వరివిత్తనాలు ఐదు రూపాయలకే గిట్టుబాటు అవుతుందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

బొబ్బిలి డివిజన్‌లో సాగు..

బొబ్బిలి వ్యవసాయశాఖ డివిజన్‌పరిధిలోని ఐదు మండలాల్లో మండలా నికి 25 ఎకరాల చొప్పున విత్తన వరి పంట సాగుకు ఈ ఏడాది రైతులు సన్నద్ధమవుతున్నారు. విత్తనపంట సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు ప్రభుత్వం ప్రకటించలేదు. మిగిలిన రైతులకు ఇచ్చిన మాదిరిగానే విత్తనాల ను 50 శాతం రాయితీ లేదా కిలో పదిరూపాయల ధర ప్రాతిపదికన ప్రభు త్వం సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటోంది. శిక్షణలతో సరిపెడుతోంది. విత్తనాలను సొంతంగా తయారు చేసుకోవాలని చెబు తున్న ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించక పోవడం, ఏపీ సీడ్స్ ద్వారా గాని ఇతర విత్తనాలను సకాలంలో అందకపోవడంతో రైతులు విత్తనపంట సాగు విషయంలో ఆసక్తి చూపడంలేదు. రైతులు పండించిన విత్తనపంటను బైబ్యాక్ పాలసీకింద తీసుకునేందుకు నిబంధనలు కఠినతరంగా ఉండడంతో రైతులు ఆ సాగు జోలికిపోవడం లేదు. ప్రైవేట్ దుకాణాల్లో కావాల్సిన విత్తనాలు, కావాల్సినప్పుడు లభ్యం అవుతుండడంతో ప్రభుత్వ ఆంక్షలతో కూడిన విత్తనాలు తమకెందుకు అని పలువురు రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా విత్తనపంట (ఫౌండేషన్ సీడ్) మాత్రమే సరఫరాచేస్తోంది. ఈ ఏడాది కేంద్రం నుంచి ఆశించిన రీతిలో విత్తన పంటకు ప్రోత్సాహం లేదని రైతులు చెబుతున్నారు.

రైతులకు శిక్షణ ఇస్తున్నాం..

విత్తనోత్పత్తి పంటసాగు చేసే రైతులకు విజయనగ రం రైతు శిక్షణ కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామని బొబ్బిలి ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపా రు. రైతులు తమ పంటపొలాల్లో తయారు చేసుకునే విత్తనాలను మూడేళ్లపాటు వినియోగించుకుంటూనే సాటి రైతులకు పంపిణీ చేయవచ్చనే విధానం గతంలో అమలులో ఉండేదని చెప్పారు. కేవలం కిలో ఐదురూపా యలకే విత్తనాలను



కారాడ ప్రాంతంలో విత్తనోత్పత్తి కోసం నాట్లువేస్తున్న రైతులు

తయారుచేసుకోవచ్చని తెలిపారు. విత్తన వరి పంటను సాగుచేసిన పొలాల్లో మూడుదశల్లో కేళీలను తొలగించుకోవాలని చెప్పారు. గొల్లపల్లి, కోమటిపల్లి, గోపాలరాయుడిపేట, అలజంగి, పక్కి, పిరిడిలో విత్తన వరిసాగు ప్రస్తుతం జరుగుతోందని తెలిపారు. పెద్దకమతాలున్న రైతులు తమ విత్తనోత్పత్తిని ఏపీసీడ్స్ వంటి సంస్థలకు మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. బొబ్బిలి మండలంలోని కారాడ, అలజంగిలో 25 ఎకరాల్లో విత్తనపంట సాగుకోసం ఏడున్నర క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సరఫరా చేశామని తెలిపారు.

నాగావళి తీరంలో భద్రం

(ఐదో పేజీ తరువాయి)

చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంతకవిటి మండలం కొత్తూరు రామచంద్రపురం దగ్గర నాగావళి నది ప్రవాహాన్ని కలెక్టర్ అంబేడ్కర్ మంగళవారం పరిశీలించారు. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిటర్నింగ్ వాల్ కావాలని ప్రజలు కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ తక్షణ సాయం కింద రిటర్నింగ్ వాల్ కోసం ఐదు లక్షల రూపాయలు రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి రాజాంకు బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

● వంగర మండలంలోని మడ్డువలస రిజర్వాయర్‌ను కూడా కలెక్టర్ అంబేడ్కర్ మంగళ వారం సందర్శించారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో విషయమై ఆరా తీశారు. లోతట్టు గ్రామాల ప్రజలకు ఎలాంటి ముప్పు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎస్ఈ సుధాకర్‌బాబుకు ఆదేశించారు. అవసరమైతే డ్రోన్‌లు ఉపయోగించి మందు పిచికారీ చేసి వాటిని తొలగించాలన్నారు. ప్రధాన గేట్ల నుంచి నీరు విడుదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, మత్స్యకారులను సైతం గేట్ల వద్దకు రానీయకుండా చూడాలన్నారు.

బిక్కుబిక్కుమంటూ విధులు

(ఐదో పేజీ తరువాయి)

లేదంటే అందరూ ఆశ్చర్యపోతున్నారు. దశాబ్దకాలంలో ఆరేడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపారు. అవి ప్రభుత్వం వద్ద ఉండిపోతున్నాయి కాని శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త భవనాలు మంజూరు కావడం లేదు. సమస్యను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదు. శిథిలావస్థకు చేరిన స్థలంలో పాత భవనాలు తొలగించి ఎక్సైజ్ ప్రొహిబిషన్ టౌన్, రూరల్, ఈఎస్ టాస్క్‌ఫోర్సు విభాగాలకు నూతన భవనాలు నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ టౌన్, రూరల్, ఈఎస్‌టాస్క్‌ఫోర్సు, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్‌కమిషనర్ కార్యాలయాలకు నూతన భవనాలు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తే శాశ్వత భవనాలు సమకూరుతాయి. పాత భవనాల్లో ఫైళ్లను భద్రపరచడానికి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఆ భవనాలు ఎప్పుడు కూలుతాయోనన్న భయం వారిలో ఉండడం వాస్తవమే.

- శ్రీనాథుడు, జిల్లా ఎక్సైజ్ అధికారి

వారు సాధించారు

(ఐదో పేజీ తరువాయి)

కొండధారను తాగునీటిగా మలుచుకున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండలపైనుంచి రెండు బండరాళ్ల మధ్యనున్న సన్నని సందులోంచి ఎప్పటి నుంచో జలధార వస్తోంది. కిందకు వచ్చేసరికి కలుషితమవుతోంది. దీంతో గ్రామస్థులు పైనే బండరాళ్ల మధ్య ఉన్న సందులాంటి ఖాళీలో పీవీసీ పైపు అమర్చి దాని చుట్టూ గుడ్డలను బ్యాండేజీ తరహాలో చుట్టి మరో చిన్న పైపును అమర్చారు. వంద మీటర్లు కిందనున్న ప్రాంతానికి నీరు వచ్చేలా చేసుకొని అక్కడ్నించి బిందెలతో నీరు పట్టుకుంటున్నారు. వారి ఆలోచన బాగుందని అందరూ అభినందిస్తున్నారు.

అలసత్వం ఎందుకో?

(ఐదో పేజీ తరువాయి)

పేర్కొంటూ ఇరిగేషన్ డీఈఈకి సూచించారు. వారివైపు నుంచి నేటివరకు కనీస కదలిక లేదు. ఆంధ్ర జలాశయం నీటినిల్వ పూర్తి సామర్థ్యం 146 మీటర్లు కాగా ప్రస్తుతం 140.20 మీటర్లకు చేరింది. ఒకట్రెండు రోజుల్లో మళ్లీ వర్షాలు కురిస్తే జలాశయం నిండుకుండను తలపిస్తుంది. అదే జరిగితే ఎగువ, దిగువ ప్రాంతాలు ఎప్పట్లాగే ముంపునకు గురయ్యే ప్రమాదముంది. దీనిపై ఆయా ప్రాంతాలవారు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఇరిగేషన్ అధికారుల తీరుపై ఇప్పటికే విమర్శలున్నాయి. ఆంధ్ర భూముల ఆక్రమణపై ఇదివరకే తహసీల్దార్‌కు లేఖ రాశామని ఇరిగేషన్ డీఈ రామునాయుడు ఈనెల 1న ఆంధ్రజ్యోతికి తెలపగా అటువంటిదేదీ తమకు అందలేదని తహసీల్దార్ అరుణకుమారి తేల్చిచెప్పారు.

● రిజర్వాయర్ భూముల్లో ఆక్రమణలు క్రమంగా విస్తరిస్తున్నాయి. అధికారులు ఇటువైపు చూడనందున కబ్జారాయుళ్ల దర్జాగా చెరబడుతున్నారు. దీన్ని ఇలాగే వదిలేస్తే రిజర్వాయర్ గర్భాన్ని కూడా కొల్లగొట్టినా ఆశ్చర్యపోనవసరం లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమణలు పెరిగితే నీటినిల్వ సామర్థ్యం కుచించుకుపోయి చివరి ఆయకట్టుకు నష్టం జరుగుతుందని వాపోతున్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలపై కొరడా ఝుళిపించాలని రైతులు కోరుతున్నారు.

రికార్డులు పరిశీలించి చర్యలు

ఆక్రమణల అంశాన్ని ఇరిగేషన్ జేఈ కృపానంద్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా తహసీల్దార్ లేఖ నేపథ్యంలో ఆంధ్ర రిజర్వాయర్ భూముల రికార్డులను పరిశీలించాలని నిర్ణయించామని, అయితే అవి తమ డివిజన్ కార్యాలయంలో అందుబాటులో లేనందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. త్వరలో రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ జాయింట్ సర్వే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఇదేనా.. మీ పరిశీలన?

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో దివ్యాంగపించన్‌పొందుతున్న వారికి జరిగిన పునఃపరిశీలనలో అత్యధికశాతం మందికి అతి తక్కువ దివ్యాంగ శాతం గుర్తింపు నిచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పునఃపరిశీలనకు వెళ్లినప్పుడు కనీసం ముఖం కూడా చూడలేదని, ఎటువంటి పరీక్షలు చేయకుండానే పంపించేయడంతో అప్పుడే అనుమానించామని బాధితులు అంటున్నారు. సరిగా తనిఖీ చేయకుండా నచ్చిన విధంగా దివ్యాంగ శాతం నమోదు చేయడంతో అన్యాయం జరిగిందని మంగళవారం ఎస్.కోట ఎంపీడీవో కార్యాలయానికి అప్పీల్‌కు వచ్చిన దివ్యాంగులు 'ఆంధ్రజ్యోతి' వద్ద వాపోయారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్, దివ్యాంగ పింఛన్ దారుల్లో అనర్హులనుభారీగా గుర్తించింది. దీంతో అర్హులను పక్కాగా తేల్చేందుకు పునః పరిశీలనకు ఆదేశించింది. జిల్లా కేంద్ర ఆసుపత్రి(జీజీహెచ్), ప్రభుత్వ ప్రాంతీయఆసుపత్రుల్లో ప్రత్యేకసదరం వైద్యశిబిరాలను ఏర్పాటు చేసింది. గ్రామ,వార్డు సచివాలయాల వారీగా మెడికల్, దివ్యాంగుల శాతం నిర్ధారించేందుకు షెడ్యూల్ వారీగా పింఛన్‌దారులను తరలించారు.దాదాపు మూడు నెలల పాటు వీరికి పునఃపరిశీలన చేపట్టారు. అనంతరం మెడికల్, దివ్యాంగ శాతం వివరాలను పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు నేరుగా పంపించారు. ఆ ప్రకారం మెడికల్, దివ్యాంగ శాతం తక్కువగా ఉన్నవారందరి సామాజిక పింఛన్‌ను తొలగించారు.ఇందుకు సంబంధించిన జాబితాను నాలుగు రోజుల క్రితం గ్రామ,వార్డు సచివాలయాలకు పంపించారు.అయితే శుక్రవారం నుంచి ఆదివారం వరకు సెలవులు రావడంతో బాధితులకు సమాచారం ఇవ్వలేదు. అప్పటికే గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దల ద్వారా తెలుసుకున్న వీరంతా ఎప్పటి నుంచో అందుకుంటున్న పింఛన్‌ను ఇప్పుడు తొలగించడమేంటని మథనపడుతూవచ్చారు.కాగాసోమవారం నుంచితొలగించిన మెడికల్, దివ్యాంగ పింఛన్‌దారులకు సచివాలయ సంక్షేమ అసిస్టెంట్‌లు నోటీస్‌లు అందించారు. పునఃపరిశీలనలో వైకల్య శాతం 40శాతం కంటే తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఎంత శాతం వుందో అందులో పొందుపరచలేదు. దీంతో పింఛన్ తొలగింపు నోటీస్‌లు అందుకున్న వారంతా పునఃపరిశీలనలో ఎంత శాతం నమోదు చేసారో చెప్పాలని గ్రామ, వార్డు సచివాలయ అధికారులను డిమాండ్ చేశారు. ఆ వివరాలేమి లేవని,ప్రస్తుతానికైతే నోటీస్‌లు అందుకున్న వారంతా అర్హులని భావిస్తే మండల ప్రజా పరిషత్ అధికారి, మున్సిపల్ అధికారులకు అప్పీల్ చేసుకోవాలని సూచించారు. దీంతో వీరంతా మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

అప్పీల్‌కు అవకాశం..

దివ్యాంగ పింఛన్‌లకు అనర్హులుగా నోటీస్‌లు అందుకున్నవారంతా తాము అర్హులమని భావించినట్లయితే మండల పరిషత్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో అప్పీలు చేసుకొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక్కడ ఇచ్చిన వినతిపత్రాన్ని పింఛన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీరందరికీ దివ్యాంగశాతం గుర్తింపునకు మరోసారి నోటీస్‌లు జారీచేస్తారు. షెడ్యూల్ ప్రకారం జీజీహెచ్, ప్రాంతీయ ఆసుపత్రుల్లో దివ్యాంగ శాతం గుర్తింపునకు గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు పంపిస్తారు. ఈమేరకు సోమవారం వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వైద్య విద్య డైరెక్టర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ల నుంచి ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌లకు సమాచారం అందింది.

మెరుగైన వైద్యమందించండి: డీఎంహెచ్‌వో



సిబ్బందితో మాట్లాడుతున్న జీవనరాణి

తెర్లాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా వైద్యధికారి ఎస్.జీవనరాణి కోరారు. మంగళవారం మండలంలో పెరుమాళి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేశారు.ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, రోగులకు అందజేస్తున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగుల ఓపీ, పార్మసీ, ల్యాబ్, వ్యాక్సినేషన్ పనితీరు, రికార్డులను పరిశీలించారు.సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, శెట్టి శ్రీపివాసరావు, సీసీలు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



తోటపల్లి కుడి కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితులు తలెత్తితే ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాలని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు.మంగళవారం మండలంలోని చింతాడ, పక్కి, రాముడువలస తదితర గ్రామాల్లో అల్పపీడనం నేపథ్యంలో వర్షాలు కురుస్తుండడంతో పర్యటించారు. తొలుత చెరువులు, వాగులు, తోటపల్లి కుడి కాలువను పరిశీలించారు. చెరువులు గండి కొట్టకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి, గ్రామస్థుకు సూచనలు చేశారు.అనంతరం గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని, శిథిల ప్రభుత్వ భవనాలవైపు ఎవర్నీ అనుమతించవద్దని వీఆర్వోలకు సూచించారు. చెరువులను పర్యవేక్షించి, కట్టలు తెగే పరిస్థితి ఉత్పన్నమైతే, తీసుకోవలసిన జా గ్రత్తలను వివరించారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా వెంటనే తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

బొబ్బిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పోలీసు క్వార్టర్స్‌లో గల శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.అర్చకులు మూర్తి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ కటకం సతీష్‌కుమార్, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పాలాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 1200 మందికి అన్నదానం చేపట్టారు.

గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలి

బాడంగి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ గ్రీవెన్స్ నమోదుకు బుధవారం చివరి రోజుని ఏవో జి.సూర్యప్రకాష్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద రైతు ఆధార్, వన్‌బీ, ఫోన్ నెంబర్ తీసుకొని వెళ్లి గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రూ.23 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీరాజు డిమాండ్



మాట్లాడుతున్న జేసీ రాజు

బొబ్బిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్‌దారులకు చెల్లించాల్సిన రూ.23 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం బొబ్బిలిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల రోజురోజుకు విశ్వాసం సన్నగిల్లుతోందని తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ క్లిష్టతరంగా ఉందని, దీనిపై పునరాలోచించాలని కోరారు. సమావేశంలో నాయకులు బంకురు జోగినాయుడు, సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్, ఆర్ఎన్ రాజు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందజేయాలి: కమిషనర్

బొబ్బిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందివ్వాలని మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి కోరారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు.నిర్ధేశించిన పరిమాణంలో క్లోరినేషన్ నిర్వహించి తాగు నీటిని పంపిణీచేయాలని తెలిపారు. శానిటేషన్ నిర్వహణలో జాగ్రత్తలు పాటిం చాలని కోరారు.15వఆర్థికసంఘం నిధులతో చేపట్టిన పనులను పూర్తిచేయాలని డీఈఈ పెదిరెడ్ల కిరణ్‌కుమార్ కోరారు.ఈ సమావేశంలో ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీ: ఎంపీడీవో

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద కేంద్రంలో సేంద్రియ ఎరువులు తయారు చేయిస్తున్నామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మెట్టవలసలో చెత్త సేకరణ ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ, పర్యావరణ పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు.చెత్త నుంచి సంపదకేంద్రంలో సేంద్రియఎరువులు తయారు చేయిస్తున్నామన్నారు.చెత్తను రోడ్ల పక్కన, కాలువల్లో వేయకుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని సూచించారు. అనంతరం రక్షిత మంచినీటి పథకం వ్యాటర్ ట్యాంకును పరిశీలించారు.

బొబ్బిలిలో ఫొటోగ్రఫీ దినోత్సవం



బొబ్బిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

బొబ్బిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొనిర్యాలీ నిర్వహించారు. తొలుత కేక్‌కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలను వైద్యాధికారి గేదెల శశిభూషణరావు చేతుల మీదుగా పంపిణీచేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం నాయకులు ఆవాల సన్యాసిరావు, రవిశంకర్, రంగా, రాజన్, మురళి పాల్గొన్నారు.

రీసర్వే పూర్తి చేయాలి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.శ్రీను కోరారు. మంగళవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఎస్‌డీటీ శివున్నాయుడు, వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబరు నాటికి గ్రామాల్లో బౌండ్రీలు ఏర్పాటు చేయడంతో పాటు, డిసెంబరుఒకటో తేదీకి పట్టా భూములకు సంబంధించిన రీసర్వే ప్రారంభించాలని సూచించారు. సెప్టెంబరు 15 నాటికి రీసర్వేకు సంబంధించిన ఫీల్డ్ రికార్డులు వీఆర్వోలు పూర్తి చేయాలన్నారు. ఒక రైతుకు ఎకరా భూమి ఉండి, అలాంటివారికి ఆన్‌లైన్‌లో ఎక్కువ భూమి చూపిస్తున్నట్లయితే వివరాలు తీసుకొని సరిచేయాలని ఆదేశించారు. సీలింగ్, 22ఏ, సర్వీస్ ఈనాం భూములు,లేఅవుట్ కన్వర్షన్‌పై సమీక్షించారు. సమావేశంలో డీటీ సుబ్బయ్య, ఆర్ఐ రాంకుమార్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పింఛన్ల జాబితా

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామసచివాలయాల వారీగా నోటీసుబోర్డులో నిలిపివేయనున్న దివ్యాంగుల పింఛన్ల జాబితా వివరాలు ప్రదర్శనకు ఉంచామని ఎంపీడీవో పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తులు ఎవరైనా నెల రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దివ్యాంగ పింఛన్ అందుకుంటున్న వారిలో 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి సెప్టెంబరు నుంచి పింఛన్ నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. మండలంలో ఇంత వరకు 1112 మందికి దివ్యాంగ పంచన్ను పంపిణీ చేస్తుండగా, ఇందులో 499 మందిని అనర్హులుగా గుర్తించారని, 101 మందిని వృద్ధాప్య పింఛన్ కింద మార్చారని తెలిపారు.

ఆలోచనతో ముందుకు సాగాలి

డెంకాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆలోచనతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఐహెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు జి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు అచ్చిరెడ్డి అన్నారు. ఐహెచ్ఆర్‌సీ నేషనల్ చైర్మన్ రాజన్‌ప్రసాద్ ఆదేశాల మేరకు, జిల్లా సెక్రటరీ ఎస్‌పీ.నాయుడు నేతృత్వంలో డెంకాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సుమారు వంద మందికి గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఐహెచ్ఆర్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



పైడిమాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

విజయనగరం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న పైడిమాంబ ఆలయాన్ని పునఃనిర్మించారు. మంగళవారం పైడిమాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బర్ల నాగేశ్వరరావు, సత్యవతి దంపతులు ఆలయ నిర్మాణానికి సహకరించడమే కాకుండా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి శంభాన లక్షణరావు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలి

బొండపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే సీపీఐ 28వ మహాసభలు విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు. సీపీఐ మండల అధ్యక్షులు ఎంవీ రమణ, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటుకు మందులు సిద్ధం

కొత్తవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పీహెచ్‌సీలో కుక్క కాటుకు, పాము కాటుకు మందులు సిద్ధంగా ఉన్నాయని ఈ రెండు పీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారులు గోపాలకృష్ణ, సీతల్ వర్మ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే కుళ్లిన, నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోవద్దని సూచించారు. జ్వరాలు, విరేచనాలు, వాంతులు వంటివి వస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అప్పలరాజు

జామి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నింటి అప్పలరాజు, డైరక్టర్లుగా కూనిరెడ్డి సూర్యనారాయణ, బండారు నారాయణరావులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనువాస్ తండ్రి కొండపల్లి కొండబాబు హాజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో కంచరాం, ఆగూరు, అమరాం, దోసరి, గడిముడిదాం, వస్త్రపురి కాలనీ, ఒమ్మితో పాటు రాజాం పట్టణంలోని బొబ్బిలి రోడ్, చీపురుపల్లి రోడ్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు గమనించాలని ఏఈ కుమార్ కోరారు.

పీ-4 సభ్యుడికి అభినందనలు

రాజాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్‌కి సభ్యుడిగా నామినేట్ అయిన రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్‌కుమార్‌కు రాజాం స్వచ్ఛంద సంస్థల సభ్యులు మంగళవారం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాం మానవత కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, మానవత కోశాధికారి దామెర సీతారమేష్, కళా క్రియేషన్ కన్వీనరు గోకవల కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సహకరిస్తా

పార్వతీపురం, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి):జిల్లా అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. మంగళవారం పార్వతీ పురంలో మేధావులతో బీజేపీ జిల్లా అధ్యక్షు డు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు.

మేధా దక్షిణామూర్తి ప్రతిష్ఠ

పార్వతీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని సర్వమంగళా దేవిపీఠంలో మేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. అమ్మవారితోపాటు పీఠం ప్రాంగణంలో కొలువైన దేవతలకు, వైభవ వేంకటేశ్వరస్వామికి పూజలుచేశారు.కార్యక్రమంలో పీఠాధిపతి కాళిదాసుశర్మ,బ్రహ్మగ్రూప్ అధినేత బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.